క్లుప్తంగా

కేజీబీవీ తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎంపీడీవో అల్బర్ట్

పెంచికల్‌పేట్‌: మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంపీడీవో అల్బర్ట్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్‌రూం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

గాయపడ్డ చుక్కలదుప్పికి చికిత్స



గాయపడ్డ చుక్కల దుప్పి

పెంచికల్‌పేట్‌: మండలంలోని చేడ్వాయి నర్సరీ సమీపంలో ఆదివారం గాయాలతో ఉన్న చుక్కల దుప్పిని గమనించిన ఎస్సై కొమురయ్య అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎఫ్‌ఆర్‌వో అనిల్ కుమార్ తన సిబ్బంది, పశువైద్యాధికారులతో గాయపడ్డ చుక్కల దుప్పికి చికిత్స అందించారు. అనంతరం అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

విద్యుత్‌శాఖ అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

ఆసిఫాబాద్‌: ఇటీవల కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన విద్యుత్ శాఖ ఉద్యోగులను ఆ శాఖ అధికారులు శాలువాలతో సన్మానించారు. ట్రాన్స్‌కో ఆసిఫాబాద్ డీఈగా జీ వరత్నం, ఏఈ రాజలక్ష్మణ్, లైన్ ఇన్స్పెక్టర్‌గా జంజిరాత శ్రీనివాస్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఏఈ, డీఈతో పాటు లైన్‌మెన్‌ను సన్మానించారు. ఏఈ ఫిరోజ్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

‘సస్పెన్షన్ ఎత్తివేయాలనడం సరికాదు’



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్‌: వాంకిడి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంను ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వగా, హెచ్‌ఎంను సస్పెన్షన్ ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాలు కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం సరికాదని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుడు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దినకర్ మాట్లాడారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ఆదిలాబాద్‌: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు అబ్దుల్ కలాం జీవిత చరిత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి గ్రంథాలయ ముగింపు వేడుకల్లో, ఈనెల 20న బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని లైబ్రేరియన్ శ్రీనివాస్ తెలిపారు.

టోల్‌ప్లాజా కార్మికుడికి ఆర్థిక సాయం

నేరడిగొండ: టోల్‌ప్లాజా కార్మికుడు జాదవ్ కైలాష్ తండ్రి జాదవ్ రాందాస్ ఆదివారం మృతి చెందాగా.. రోల్‌మామడ టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ సీఐ టీయూ నేరడిగొండ తరపున రూ.41వేల ఆర్థిక సా యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేరడిగొండ టోల్‌ప్లాజా అధ్యక్షుడు నక్క లక్ష్మణ్, సహాయ కార్యదర్శి గజ్జెల సురేందర్, మహేశ్, ధన్‌రాజ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద భక్తుల సందడి



బోనమెత్తిన మహిళలు



ఘనంగా రావుల మల్లన్న బోనాలు

దహెగాం మండల కేంద్రంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రావుల మల్లన్న ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించారు. అక్కడే నైవేద్యం వండి బోనాలు సమర్పించారు. దహెగాంతో పాటు పెంచికల్‌పేట్, కౌటాల, కాగజ్‌నగర్, కన్నెపల్లి ఇతర దూరప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. – దహెగాం



జాతరలో వెలిసిన దుకాణాలు



నేవేద్యం వండుతున్న భక్తులు

‘అద్దె’ దోపిడీ..!

- ప్రభుత్వ పనులకు సొంత వాహనాలు
- నిధులు దుర్వినియోగం చేస్తున్న అధికారులు
- నిరుద్యోగుల ఉపాధికి కత్తెర
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కౌటాల: సమాజంలో గౌరవప్రదమైన ఉద్యోగం.. రూ.లక్షల్లో జీతాలు.. అయినా ఇవేమి తమకు సరిపోవడం లేదన్నట్లుగా కొంతమంది జిల్లా, మండల స్థాయి ప్రభుత్వ అధికారులు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. జిల్లాలో చాలా మంది అధికారులు వాహన వినియోగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేసేందుకు అద్దె కార్లను వినియోగించే వెసులుబాటు ఉంది. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవోలకు సైతం ఈ సదుపాయం ఉంది. కానీ అధికారులు నెలనెలా అందించే వాహనాల అద్దె కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. తమ సొంత వాహనాలను వినియోగిస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు ట్యాక్సీ రిజిస్ట్రేషన్ (పసుపు రంగు నంబర్ ప్లేట్) ఉన్న వాహనాలు వినియోగించాలి. ఈ వాహనానికి బీమా కోసం ఏటా రూ.30 వేలు, ఫిట్‌నెస్ కోసం రూ.1500 రవాణా శాఖకు చెల్లించాలి. సొంత వాహనం (తెల్ల నంబర్ ప్లేట్ ఉన్న వాహనం) రూ.3 వేల వరకు మాత్రమే బీమా చెల్లించాల్సి ఉండగా.. ఫిట్‌నెస్ ఛార్జీలు ఉండవు. జిల్లాలోని అనేక మంది అధికారులు సొంత వాహనాలనే వాడటంతో రవాణా శాఖ ఆదాయానికి గండిపడుతోంది.



అధి‘కార్ల’ దోపిడీ..

జిల్లాలో ఒకటి, రెండు మినహా దాదాపు అన్ని శాఖల్లో అద్దెకార్ల తంతు నడుస్తోంది. ట్యాక్సీ రిజిస్ట్రేషన్‌లు ఉన్న కార్ల యజమానుల వివరాలు తీసుకుంటున్న అధికారులు.. వీరి వాహనాలనే వినియోగించుకుంటున్నామని బిల్లులు పెట్టి డబ్బులు తీసుకుంటున్నారు. అనేకచోట్ల అధికారులే సొంతంగా వాహనాలు నడుపుతూ డ్రైవర్‌కు ఇచ్చే వేతనం సైతం తమ ఖాతాలో వేసుకుంటున్నారు. తమకు తెలిసిన వారి పేరిట ట్రెజరీ నుంచి బిల్లులు డ్రా చేసుకుంటూ రూ.5 వేల నుంచి 10 వేల కమీషన్ ఇస్తున్నారు. ప్రతీ ప్రభుత్వ అధికారి కారులో నెలలో 2500 కిలోమీటర్లు తిరగాల్సి ఉంటుంది. ఇందుకు డ్రైవర్ వేతనం, ఇంధన ఖర్చుతో కలిపి మొత్తం రూ.33 వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది. జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారుగా 110 నుంచి 120 వరకు అద్దె వాహనాల దందా నడుస్తోంది. వీటికి ప్రతినెలా రూ.33 వేల చొప్పున రూ.33 లక్షల వరకు బిల్లులు చెల్లిస్తున్నారు. ఒక్కో వాహనానికి రవాణాశాఖకు చెల్లించే బీమా, ఫిట్‌నెస్ సుమారు నెలకు రూ.4.50 లక్షల ఆదాయం రవాణాశాఖ కోల్పోతుంది.

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ అధికారుల అద్దె కార్లకు ఇటీవల జిల్లా అధికారులు బిల్లులు విడుదల చేశారని, దీంతో కారు బిల్లులు ఎవరి పేరిట తీసుకోవాలన్న ఆలోచనల్లో అధికారులు ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. బ్యాంక్ రుణాలు, సబ్సిడీ, కార్పొరేషన్లతో పాటు ఓనర్ కం డ్రైవర్ వంటి స్కీం, దళిత బంధు పథకాల్లో నిరుద్యోగ యువత ట్యాక్సీ ప్లేట్ కార్లను కొనుగోలు చేశారు. గ్రామాల్లో కొందరు కార్లను కొనుగోలు చేసి సొంత పనులతో పాటు ఇతరులకు అద్దెకు పంపిస్తున్నారు. దీంతో ట్యాక్సీ ప్లేట్ వాహనదారులకు గిరాకీలు దొరకడం కష్టంగా మారింది. ప్రభుత్వ అధికారులు తమ సొంత వాహనాలను వినియోగిస్తూ బినామీ పేర్లతో బిల్లులను తీసుకుంటూ నిరుద్యోగుల పొట్టకొడుతున్నారు. అధికారుల అద్దె దందాపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

అధికారులు ఒత్తిడి చేస్తున్నారు



ట్యాక్సీ కారుకు గిరాకీలు లేక ఇబ్బందులు పడుతున్నాం. జిల్లాలోని అన్ని మండలాల్లో అర్హులకు ఓనర్ కం డ్రైవర్ స్కీంలో ట్యాక్సీ కార్లు అందించారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో చాలా వరకు ఆయా శాఖల అధికారులే సొంత వాహనాలకు వాడుతూ బిల్లులు తీసుకుంటున్నారు. వ్యక్తిగత వాహనాల ద్వారా బిల్లులు రావడం లేదని, మండల అధికారులు ఫోన్ చేసి ట్యాక్సీప్లేట్ వాహనాల పేరిట బిల్లులు పెట్టి ఆ బిల్లులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడికి గురిచేస్తున్నారు. – ప్రశాంత్, ట్యాక్సీ డ్రైవర్, కౌటాల

అద్దె డబ్బులు రావడం లేదు



గత కొన్ని నెలలుగా ప్రభుత్వ అధికారుల అద్దె కార్లకు ప్రభుత్వం అద్దె డబ్బులు విడుదల చేయలేదు. దీంతో నేను అద్దె కారును వినియోగించడం లేదు. కౌటాలలో ప్రభుత్వ పనులను నా సొంత వాహనం వినియోగించలేదు. అద్దె కార్లు అందుబాటులో లేని సమయంలో మాత్రమే సొంత వాహనం వినియోగిస్తున్నాను. ప్రస్తుతం నేను కొన్ని సార్లు ఆర్టీసీ బస్సులో, కొన్ని సార్లు కౌటాల డీటీ ముస్కార్ అలీ కారులో డ్యూటీకి వస్తున్నాను. – పుష్పలత, తహసీల్దార్, కౌటాల

పటిష్ట భద్రత మధ్య పరీక్షపత్రాలు తరలించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ప్రశ్నపత్రాల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలో జరుగుతున్న గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ కోసం స్ట్రాంగ్ రూం నుంచి పరీక్ష పత్రాలను పటిష్ట భద్రత మధ్య కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో గల స్ట్రాంగ్ రూంలో భద్రపర్చిన పరీక్ష పత్రాలను, ఓఎంఆర్ షీట్లను జిల్లాలో ఏర్పాటు చేసిన 18 పరీక్ష కేంద్రాలకు తరలించే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్, నోడల్ అధికారి దీపక్ తివారీతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహ, రూట్ అధికారులు, ముఖ్య పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



బషీరుద్దీన్ (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలోని ఈజగాం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బషీరుద్దీన్ (59) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. 1990లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సివిల్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. గత కొన్ని రోజులుగా అనా రోగ్యంతో బాధపడుతున్న బషీరుద్దీన్ ఆదివారం మృతిచెందారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని సొంత జిల్లా నాగర్‌కర్నూల్‌కు తరలించారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావ్ బషీరుద్దీన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంత్యక్రియల నిమిత్తం రూ.20వేలు అందజేశారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో పీజీ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగ్‌రాం అంతర్వేది, పీజీ సమన్వయకర్త కె.రాజ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ బాటనీలో 24 సీట్లు, ఎంఎస్సీ జువాలజీలో 1 సీటు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సీపీజీఈటీ పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, డిగ్రీ పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు లభించినవారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదని, ప్రాసెసింగ్ ఫీజు రూ.2100, ట్యూషన్ ఫీజు రూ.35800 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 20 వరకు గడువు ఉందని, కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

‘రాజ్యాంగ దినోత్సవం’ విజయవంతం చేయాలి



ఖమాన గ్రామంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వాంకిడి: జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్షభూమి ప్రాంగణంలో ఈ నెల 24వ తేదీన సమత భారత్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు జిల్లాలోని బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. ఆదివారం మండలంలోని కనర్‌గాం, ఖమాన, వాంకిడి, భీంపూర్ గ్రామాల్లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాజ్యాంగ విశిష్టత, రాజ్యాంగ నిర్మాణంలో బీఆర్ అంబేద్కర్ కృషి, తదితర అంశాలపై ప్రముఖులచే అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నారావు, జాడి అన్నారావు, రవీందర్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు

- మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక నిఘా

సిర్పూర్‌(టి): తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దుల్లో పోలీసు, రెవెన్యూ వ్యవసాయ, సేల్స్‌ట్యాక్స్ తదితర శాఖల అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈనెల 20న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్రకు ఆనుకుని కొముురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు మండలాలు ఉండటంతో జిల్లాలోని నేషనల్ హైవే రహదారితో పాటు సిర్పూర్(టి)–మాకిడి అంతర్రాష్ట్ర రహదారి, వెంకట్రావ్‌పేట్ –పోడా అంతర్రాష్ట్ర రహదారి, గూడెం –అహెరీ అంతర్రాష్ట్ర రహదారుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో జిల్లాలోని మూడు అంతర్రాష్ట్ర రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టేందుకు పంపిణీ చేసే చీరలు, క్రీడా సామగ్రి, ఇతర వస్తువులు తరలిస్తే వాహనాలను సీజ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఏసీటీవో వెంకటేశ్వర్లు తెలిపారు.



సిర్పూర్(టి) చౌరస్తా వద్ద రాత్రివేళ తనిఖీలు చేస్తున్న అధికారులు

జిల్లాలో మూడు ప్రత్యేక టీంలు..

మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సిర్పూర్(టి) –మాకిడి అంతర్రాష్ట్ర రహదారి, వెంకట్రావ్‌పేట్ –పోడ్సా అంతర్రాష్ట్ర రహదారి, గూడెం –అహెరీ అంతర్రాష్ట్ర రహదారుల్లో ధ్రువపత్రాలు లేకుండా, జీఎస్టీ కట్టకుండా తరలించే వస్తువులతో పాటు ఇతర సామగ్రి తరలించకుండా నియంత్రించేందుకు జిల్లా ఉన్నతాధికారుల మేరకు మూడు ప్రత్యేక సేల్స్‌ట్యాక్స్ టీంలు ఏర్పాటు చేశారు. ఆయా అంతర్రాష్ట్ర రహదారుల్లోని చెక్‌పోస్టుల్లో ఇప్పటి వరకు అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న 45 లీటర్ల గుడుంబా, 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కోట్నాక విజయ్‌కుమార్

వాంకిడి: గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కోట్నాక విజయ్‌కుమార్, సీనియర్ నాయకుడు అరిగెల మల్లికార్జున్ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయిగోపాల పాఠశాల మైదానంలో బీజేపీ మండల కార్యదర్శి చీదర్ల నరేశ్, కన్వీనర్ రాంషావ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల సంస్థగత ఎన్నికల కార్యశాల కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికలపై మండల, గ్రామస్థాయి నాయకులకు దిశా నిర్దేశం చేసి సిద్ధంగా ఉండాలని సూచించారు. మండలంలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకునేలా ప్రణాళికతో ఉండాలని తెలిపారు. అనంతరం సభ్యత్వం గురించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు’



సభలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వర్ధ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు చేస్తుందని మండిపడ్డారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చడం లేదన్నారు. బీజేపీ కూటమి విజయంతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. బీజేపీ హయాంలో వర్ధ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ నాయకుల అబద్ధపు ప్రచారాలను పార్టీ కార్యకర్తలు తిప్పికొట్టాలని అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి పంకజ్ బోయర్, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను తగలబెట్టొద్దు

ఆదిలాబాద్‌టౌన్‌: వరి కోతల తర్వాత కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఇలా చేయడం ద్వారా వాతావరణ కాలుష్యంతో పాటు ఊపిరితిత్తుల్లో వాయుసంబంధ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నెలలో సారం దెబ్బ తినడమే కాకుండా సూక్ష్మజీవులు సైతం దెబ్బ తిని జీవ వైవిధ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. పంట తీత తర్వాత వరి కొయ్యలను కలియ దున్నడం ద్వారా నెలలో సారం పెరుగుతుందని సూచించారు.

కార్తిక వనభోజనాల సందడి



కార్తిక వనభోజన కార్యక్రమంలో మహిళలు

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని వాసవీ మందిర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తిర్యాణి మండలం దంతన్‌పెల్లి భీమన్న ఆలయం వద్ద కార్తిక వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్తిక మాసం పురస్కరించుకొని జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్సులు, వాహనాల్లో తరలి వెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. అక్కడే ప్రత్యేకంగా భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తాటిపెల్లి అశోక్, చిలువేరు వెంకన్న, తాటిపెల్లి దిలీప్, గుండ ప్రమోద్, కాచం వినేశ్, కొలిప్యాక శంకర్, ఆలయ కమిటీ ప్రతినిధులు రావుల శంకర్, మురళీధర్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

ఆసిఫాబాద్‌: జైనూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివనూర్ ఎక్స్ రోడ్ వద్ద ఆదివారం ఎస్సై సాగర్ ఆధ్వర్యంలో 250 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని జగన్నాథ్‌పూర్‌కు చెందిన మడావి జంగు, మడావి బీర్షావ్ వద్ద ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సిర్పూర్‌యూ మండలానికి చెందిన మడావి ఇస్రు నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని, మడావి ఇస్రు పరారీలో ఉన్నాడని ఎస్సై పేర్కొన్నారు.